# బలహీనుడి ఆత్మనిగ్రహం



**కొండముది శ్రీరామచంద్రమూర్తి**

"ఈ వంద చాలకపోతే మరో వంద తీసుకోండి మాష్టారూ! కానీ మీరు మా పని మాత్రం పూర్తి చేసి పెట్టాలి. తప్పదు, ప్లీజ్!"

అతని కంఠంలో నిజాయితీ ధ్వనించింది. అతని జేబు బరువుగా, ఎత్తుగా వుంది. అతని కళ్ళు ఎర్రగా, జీరగా వున్నాయి. అతని వేళ్ళకున్న ఉంగరాలు ధగధగా మెరిసిపోతున్నాయ్. అతను పొందూరు ఖద్దరుపంచె కట్టుకుని, పెద్దాపురం సిల్కులాల్చీ తొడుక్కున్నాడు. మనిషి నల్లగా, పొడుగ్గా వున్నాడు. సెంటువాసన వేస్తున్నాడు.

శివశంకరనారాయణ తల అడ్డంగా తిప్పాడు "ఐయామ్ సారీ! ఈ పని నేను చెయ్యలేను!" అతని కంఠం అతనికే చిత్రంగా ధ్వనించింది తల అడ్డంగా తిప్పడంలో మెడనరాలు కలుక్కుమన్నాయి.

"మీ అభ్యంతరం ఏవిటి?"

శివశంకరనారాయణ అపహసిస్తున్నట్లుగా సన్నగా నవ్వాడు. "పరీక్ష

హాల్లోంచి మీరు బయటకు పేపరు తెస్తా ననడమే తప్పు. ఆ తెచ్చే పేపరును నన్ను ఆన్సరు చేయమనడం మరో తప్పు. నేను ఆన్సరు చేస్తే గీస్తే దాన్ని తీసుకువెళ్ళి పరీక్షహాల్లో మీ అబ్బాయికి అందిస్తాననడం ఇంకో తప్పు. ఇన్ని తప్పులు పెట్టుకుని......"

అమాయకుడి గీతాపారాయణకు అర్థం లేదన్నట్లుగా అతని మాటలు విన్న నాయుడు పగలబడి నవ్వాడు. "నిజంగా మీకు లోకరీతి తెలీదు మాష్టారూ! కనీసం నేను ఏం వ్యాపారం చేస్తానో అదయినా మీకు తెలుసా?"

నారాయణ తెలీదన్న సూచన చేశాడు. "నా దగ్గర ట్యూషన్ చదువుకునే స్టూడెంట్స్ పర్సనల్ మేటర్స్ గురించి నేను పట్టించుకోను."

"అప్పుడప్పుడూ పట్టించుకోవాలి సార్! ఉదాహరణకు నన్నే తీసుకోండి. నా వ్యాపారం లిక్కర్ బిజినెస్!"

నారాయణ కళ్ళు ఆశ్చర్యంతో పెద్ద వయ్యాయి. "అంటే మీరు..."

"బీరు, బ్రాంది, విస్కీ వగైరా అమ్ముతాను. మన దేశంలో తయారైనవే కాదు, స్మగుల్డ్ గూడ్స్ కూడా తెప్పిస్తాను. షాంపైన్ బెస్ట్ క్వాలిటీ దొరుకుతుంది నా దగ్గర. ఆమ్‌స్టెల్ బీర్ టిన్నుల్లో అందించగలను. మీకే మన్నా రెండు టిన్నులు పంపించనా?"

"అక్కర్లేదు నేను టీ టోటలర్ని?"

"పగటిపూట అందరూ అంతే మాష్టారూ! కాస్త చీకటిపడేసరికి కప్పుకున్న బురఖా కాస్తా ఫుటుక్కున జారిపోతుంది. ఒక్కసారి నా షాపు దగ్గరకు రండి. కాసేపు నా కుర్చీ ప్రక్కన కూచోండి. యూనిఫారాల్లో వున్న కానిస్టేబుల్స్ వస్తారు, దొరగారు ట్రిపుల్ ఎక్స్ రమ్ తెమ్మన్నా' రంటూ! రిక్షాల్లో కాలేజీ స్టూడెంట్స్ వచ్చి పార్టీలు చేసుకోవాలంటూ పట్టుకు పోతారు, కన్నుపడిన సీసానల్లా, అడిగిందానికన్నా ఎక్కువ టేబిలుమీద పడేసి. బ్రహమిన్ బోయిస్‌కు సాయంకాలానికల్లా చికెన్‌పులావ్, గొంతుకడ్డం పడకుండా ఐస్ కోల్డ్ బీర్ వుండాలి!"

శివశంకరనారాయణ మొహం కోపంతో జేవురించింది. "ఇదంతా ఎగ్జాజరేషన్. ఉత్ప్రేక్ష నన్ను టెంప్ట్ చేయడానికి మీరు వేసిన ఎత్తు." అన్నాడు.

నాయుడు అగ్గిపుల్ల గీసి చుట్ట వెల్గించుకుంటూ, "మాష్టారూ! ఈ దేశంలో నీతికీ, అవినీతికీ పెద్ద తేడా లేదండీ! అవకాశం రానంతవరకే అంతా అవినీతి వస్తే అదే నీతిగా రూపం మార్చుకుంటుంది.

"ఇటువంటి వేదాంతంతోనేనా మీరు మీవాణ్ణి సబిన్స్పెక్టరు చెయ్యాలను కుంటున్నది?"

"ఏం తప్పా?"

"అక్షరాలా తప్పే! ఆరువందల మంది రేపు పరీక్షకు కూచుంటున్నారు. మీవాడికి ఇంగ్లీషు రాదు, తెలుగు అంత కన్నా రాదు. మీ మాటల ప్రకారమే నీతి అవినీతులను గురించిన పట్టింపు కూడా లేదు! పరీక్ష హాల్లో ఎవరికో లంచం ఇస్తారు. పేపరు బయటకు తెస్తారు. ఎవరో ఆన్సరు చేసిన పేపరును మీవాడు సబ్మిట్ చేస్తాడు. మళ్ళీ పై అధారిటీస్‌కు లంచాలు. మీవాడికి సెలెక్షన్ వస్తుంది. కానీ సెలెక్ట్ అయిన మర్నాటినుంచీ అతను సమాజం ఎడల ఎట్లా ప్రవర్తిస్తాడు? ఎంత నిర్లక్ష్యంగా వుంటాడు? డబ్బుమీద దృష్టి తప్ప అతగాడికి మరో దృష్టి వుంటుందా? దొంగ కేసులు బనాయిస్తాడు లంచాలు దండిగా పుచ్చుకుంటాడు. కిందవాళ్ళ మీద జులుం చేస్తాడు. పైవాళ్ళకు వంగివంగి దణ్ణాలు పెడతాడు. నో...నో... ఇటువంటివాడికి నేను సహాయం చేయను. చెయ్యలేను..."

చుట్ట నుసి ఆష్ట్రేలో దులుపుకుని, లేచి నుంచుంటూ అన్నాడు నాయుడు "సరే మీ ఇష్టం! రేపొద్దుటిదాకా వెయిట్ చేస్తాను డబ్బు గురించి నాకు పట్టింపు లేదు. మీరడిగినంత ఇస్తాను. వో వంద ఎక్కువే తీసుకోండి, ఏం ఫర్వాలేదు. పని జరిగిపోవాలి అంతే! మీరు కాదంటే యం యస్ వీ గారని ఇంకో లెక్చరరు గారున్నారటగా? — ఆయన్నడుగుతాను. ఆయనిట్లా బాధ పెట్టడని విన్నాను. మర్చిపోకుండా ఏ విషయమూ నాకు కబురు చేస్తారుగా?" నాయుడు చేతికర్ర వూపుకుంటూ, హుందాగా, విలాసంగా, బయటకు వెళ్ళిపోయాడు.

శివశంకరనారాయణ కూర్చున్న కుర్చీలోనుండి లేవలేదు. తాను అమాయకంగా నాయుడు కొడుక్కి ట్యూషన్ చెప్పాడు. నెలరోజుల ట్యూషనుకూ తాను అడిగింది వంద రూపాయలే అయితే, కవర్లో పెట్టి రెండొందలిచ్చారు. "ఇదేమిటయ్యా?" అంటే "ఇది మా ఆనందం మాష్టారూ!" అన్నారు కానీ వాళ్ళ మనసుల్లో ఇంత కుట్ర వున్న సంగతి తనకేం తెలుసు? తనచేత ఆ పరీక్ష పేపర్లు రాయించి, అవి ఆ స్టూడెంట్ రాసినవిగా చెలామణీ చేయించి... మై గాడ్! అయినా ఆ ఎగ్జామినేషన్ హాల్లోంచి ఆ పేపర్లు బయటకు ఎలా వస్తాయి? బహుశః ఆ ఇన్విజిలేటర్లను కూడా ముందే కొనేసి వుంటారు. వీళ్ళా రేపటి పోలీసు వ్యవస్థకు అధికారులు..." అమాయకులైన గొర్రెలవంటి ప్రజల్ని రక్షించడానికి జాగిలం తోలుకప్పుకునే తోడేళ్ళు!!

శివశంకరనారాయణ కసిగా పళ్ళు కొరుక్కున్నాడు. "ఉహూ, నేను స్టూప్ కాను." అనుకొన్నాడు తనలో తాను.

ఇంతలో అతని రెండో కొడుకు లోపలనుండి ఆదరాబాదరాగా పరుగెత్తుకు వచ్చాడు "నాన్నారూ! నాన్నారూ! అమ్మ పిలుస్తోంది!" అంటూ. హడావిడిగా లోపలకు వచ్చిన భర్తతో అన్నది పార్వతమ్మ. "పెద్ద దానికి నొప్పులొచ్చేట్టుగా వున్నాయండీ! తొందరగా వెళ్ళి జానమ్మను పిలుచుకు రండీ!" నారాయణ గబగబా చెప్పులు తొడుక్కున్నాడు పైమీద కండువా వేసుకు బయల్దేరబోయాడు.

"ఏవండోయ్, పర్సు తీసుకువెళ్ళడం మర్చిపోకండి. ఆ డాక్టరమ్మకు ఎడ్వాన్సు ఇస్తేకాని ఆవిడ ఇల్లు కదలదు."

ఎవరో ముకుదాడు వేసినట్లుగా ఆగి పోయాడు నారాయణ. పర్సు తీసుకుని లోపలున్న డబ్బు లెక్క చూసుకున్నాడు. ఒక అయిదు రూపాయల నోటూ, రెండు రూపాయి నోట్లూ, కాస్త చిల్లరా కనిపించాయి.

"ఎంతివ్వాలేమిటీ?"

"ఓ పచ్చనోటన్నా ముందామె చేతిలో పెట్టి రండి!"


గతుక్కుమన్నాడు శంకరనారాయణ. నెలలో ఆఖరువారం. పైగా ఆదివారం తన స్నేహితులందరూ మధ్యతరగతివాళ్ళే. ఒకటీ అరా ఎవరి దగ్గరన్నా వున్నా అవి ఇతరులను అవసరంలో ఆదుకోడానికి పనికిరాదు. అతని మనోఫలకంలో ఎన్నో దృశ్యాలు కదిలాయి. ఒక్కటీ పనికివచ్చేది కాదు. ఎందరో జ్ఞాపకం వచ్చారు. ఒక్కరూ అక్కరకురారు. లోపల్నుంచి పెద్దదాని మూలుగు మరింత పెద్దగా వినిపిస్తోంది. ఉండి, వుండి 'అమ్మా!' అంటూ ఆక్రోశిస్తోంది, బాధగా, భయంగా, భారంగా, జాలిగా.

"ఇంకా ఇక్కడే నుంచున్నారేవిటండీ? – వెళ్ళరండి!" పార్వతమ్మ విసుక్కుంది.

"అదికాదే!" శివశంకరనారాయణ నీళ్ళు నమిలాడు "డబ్బు కొంచెం తక్కు..."

పార్వతమ్మ మగనివైపు అసహ్యంగా చూసింది, "ఇంత అప్రయోజకులేం?" అన్నట్లు. తర్వాత పేలవంగా, ఈ బ్రతుకు భారం ఇహ తాను మోయ లేనట్లు నవ్వింది. ఆ తర్వాత గద్గదికంగా అన్నది, "తక్కువైంది. అంతేగా! పోన్లెండి. పోయినవి పోగా, ఇదిగో ముక్కున ఈ ముక్కుపుడకుంది. చెవుల కీ దుద్దులున్నాయి. మెడలో నల్ల పూసలున్నాయి. మంగళసూత్రానికో వొంటిపేట గొలుసుంది. ఏం కావాలో చెప్పండి తీసిస్తాను!"

ఆ మాటలు విన్న శివశంకర నారాయణ ఆమెవేపు తలఎత్తి చూడలేక పోయాడు. ఆమె కళ్ళల్లోకి తను చూడలేడు. ఆ కంటి కొనలనుండి,



పల్చబడి ఎండిపోయిన బుగ్గలమీదగా క్రిందకు జారి పచ్చని ఆమె కాలివ్రేలి కున్న మట్టెలమీద పడ్డ నీటి బిందువుల్ని తాను సహించలేడు. ఆ నగలతో తన మగతనాన్ని కూడా పోగొట్టుకోలేడు.

"వద్దులే!" అంటూ గిరుక్కున వెనక్కు తిరిగిన భర్తను చూసి, ఆందోళనతో "అదేమిటండీ?—ఈ సమయంలో మొహమాటపడతారేమిటండీ?" అన్నది పార్వతమ్మ.

"మొహమాట పడ్డంలేదు పార్వతీ! మొహమాటాన్ని చంపుకుంటున్నాను. మనలాంటి బలహీనులకు వ్యక్తిత్వాలూ, మొహమాటాలూ, ఆత్మనిగ్రహమూ మొదలైనవి వుండకూడదని గ్రహిస్తున్నాను!"

"ఇదివరకే గ్రహిస్తే ఎంత బావుండేదో! — సరేగాని డబ్బుసంగతి ఏం ఆలోచించారు?"

"ఆలోచించడం అయిపోయింది పార్వతీ! — తీసుకురావడానికి నాయుడి దగ్గరకు వెళ్తున్నాను. డబ్బు తీసుకుని, అట్నుంచి అటువెళ్ళి డాక్టర్ని పిలుచుకు వస్తాను!"

బయటకు వెళ్ళిన భర్తవేపు అయోమయంగా చూస్తూ నిల్చుంది వంటింటి గడపలో పార్వతమ్మ. గడప దాటిన ఆ బలహీనుణ్ని చూసి జాలిగా నవ్వుకున్నాడు గోడమీది గాంధీజీ!